# అనకాపల్లి To అమెరికా

ఎమ్. నాగలక్ష్మి

శ్రీధర్‌కి సీతని చూస్తూంటే ఆశ్చర్యంగానూ అసహనంగానూ ఉంది.

సీత అమ్మనీ, నాన్ననీ పట్టుకుని కదిలి కదిలి ఏడుస్తోంది.

ఇరవైనాలుగేళ్ళ అమ్మాయి అమ్మా, నాన్నలని వదిలి భర్త వెంట వెళ్ళడానికి.. ఏదో రాక్షసుడి వెంట వెళ్తున్నట్టు.. ఇండియన్ అమ్మాయిలు.. ముఖ్యంగా ఆంధ్రా అమ్మాయిలు ఇంకో వందేళ్ళయినా మారరులా ఉంది. ఎంత చదువుకున్నా ఉద్యోగాలు చేస్తున్నా.. ఇలాగే ముగ్ధంగా, అమాయకంగా...

సీత వంక మురిపెంగా చూశాడు శ్రీధర్. తమ పెళ్ళయి ఇంకా వారం తిరగలేదు.. తమ మధ్య మూడుముళ్ళ బంధం తప్ప ఇంకా ఆ ముచ్చట తీరనేలేదు... అందువల్లే పరాయివాడితో వెళ్తున్నట్టు ఫీలవుతోందా?

నెల్లాళ్ళయింది తను ఇండియాకి వచ్చి. అమ్మా నాన్నల కోరిక మీద తనకు నచ్చిన అమ్మాయి దొరికితే పెళ్ళి చేసుకుందామనుకున్నాడు. ఎంతమందిని... అమ్మా నాన్నలకి నచ్చినవాళ్ళని చూసినా తనకెవరూ నచ్చలేదు.

''సీతా చెక్ ఇన్ అవ్వాలి.. ప్లీజ్.. త్వరగారా.''

సీతా శ్రీధర్ అందరికీ టాటాలు బైబైలు చెప్పి లోపలికి నడిచారు.

''ఇంకొక్కరోజు.. మనింట్లో ఉంటాం.'' శ్రీధర్ పరవశంగా అన్నాడు.

సీత ఏం మాట్లాడలేదు.

పెళ్ళయిన ఈ నాల్గురోజుల్లోనూ తమిద్దరూ మరీ ఎక్కువ ఏం మాట్లాడుకోనేలేదు. వీసా అదీ ఇదీ అంటూ తిరగడం, తిరుపతి వెళ్ళడం.. ఎవరో ఒకరు తమతో అన్నిచోట్ల ఉంటూ ఉండడం.. ప్రయాణాలు.. ఒకటే హడావిడీ. అందుకే తను ఫస్ట్ నైట్ అమెరికా వెళ్ళాకనే అంటే ఎవ్వరూ కాదనలేకపోయారు.

''సీతా కాఫీ ఏమైనా తీసుకుంటావా'' శ్రీధర్ ఆప్యాయంగా అడిగాడు.

''వద్దు'' సీత అతనివంక చూడకుండానే అంది.

సీత మాట్లాడే మూడ్‌లో లేదని గ్రహించి శ్రీధర్ నిట్టూర్చాడు.

అమ్మానాన్నలని వదిలి వెళ్తున్నానన్న బాధేమో. అయినా ఈ రోజుల్లో అమెరికా ఎంతదూరమని..

''ఏదైనా మాట్లాడకూడదూ..'' శ్రీధర్ సీత భుజాల చుట్టూ చెయ్యి వెయ్యబోయాడు.

సీత ఒక్కక్షణం ఇబ్బందిగా కదిలి అతని చేతుల్ని మెల్లిగా తొలగించింది.

''ఏమున్నాయి మాట్లాడడానికి..'' సీత అనాసక్తిగా అంది.

శ్రీధర్‌కి ఎందుకో మొదటిసారి మనస్సు చివుక్కుమనిపించింది. కొత్తగా పెళ్ళయినవాళ్ళకి మాట్లాడడానికి ఏమీ ఉండవా? ప్లేన్ ఎక్కిన ఇన్ని గంటల్లోనూ తనంతట తనే ఏదైనా మాట్లాడుతుందేమో.. అమెరికాలో తను ఇంట్లో పరిసరాలు గురించి అడుగుతుందేమో.. ప్లేన్ ఎక్కిన అనుభవం కొత్తగా ఎంజాయ్ చేస్తుంది అనుకున్నాడు. ఎన్నిసార్లు తను పలకరించినా ముభావంగా, పొడిగా జవాబులు చెప్తోంది. మొదట అమ్మానాన్నలని వదిలిన బాధ కాబోలు అనుకున్నాడు కానీ ఏమూలో ''సమ్‌థింగ్ ఈజ్ రాంగ్.. సమ్‌థింగ్ టెర్రిబుల్లీ రాంగ్'' శ్రీధర్ అంతరాత్మ అరుస్తున్నట్టు ఉంది.

• • •

శ్రీధర్‌కి అమ్మా నాన్నలు చూసి ఉంచిన ఒక్క అమ్మాయి నచ్చలేదు.

''మళ్ళీ ఏడాది వచ్చినప్పుడు చూద్దామమ్మా.. మీరు నన్ను కంగారుపెట్టకండి'' శ్రీధర్ ఖచ్చితంగా చెప్పేశాడు.

ఆరోజు అందరూ అనకాపల్లిలో ఉన్న తండ్రి ఫ్రెండింట్లో ఒడుగు అని వెళ్ళారు. సాయంత్రం బయలుదేరి వస్తూంటే ఆయన తన ఫ్రెండిల్లు అంటూ ఒకళ్ళింటికి తీసికెళ్ళాడు. అసలే పొద్దుట్నుంచీ బోరుకొట్టిన శ్రీధర్‌కి చాలా చిరాకేసింది.

'మళ్ళీ ఇంకోళ్ళఇంటికా..' మనసులోనే తిట్టుకున్నాడు ఒడుక్కి వచ్చినందుకు.

అందరూ పరిచయాలయి ఊరికబుర్లు, రాజకీయాలు మొదలుపెట్టారు. అప్పుడు కాఫీ, టిఫిన్లు తీసుకువచ్చింది ఆ అమ్మాయి. శ్రీధర్‌కీ, అతని తల్లి తండ్రులకీ కూడా అర్థమయిపోయింది ఆయన ఇక్కడికి ఎందుకు తీసుకువచ్చాడో.

''ఈ అమ్మాయి సీత. బియస్సీ కంప్యూటర్స్ చేసింది.. వైజాగ్‌లో ఉద్యోగం కూడా చేస్తోంది'' తండ్రి ఫ్రెండు రామ్మూర్తి పరిచయం చేశాడు.

''సీత గులాబీరంగు కాటన్ చీర కట్టుకుంది. నేవీబ్లూ జాకెట్.. మెడలో ఓ గొలుసు. చీర కూడా బాగా నలిగే ఉంది. అయినా సీత సౌందర్యం ముగ్ధుణ్ణి చేసింది శ్రీధర్‌ని.

శ్రీధర్ తల్లి లోపలికెళ్ళి మాట్లాడుతూ కూచుంటే బయట మగవాళ్ళు కాస్సేపు మాట్లాడుకున్నారు.

ఆ టైములో సీత వాళ్ళకీ తెలియదు అది చూపులని.

రామ్మూర్తిగారు శ్రీధర్ ఓకే అంటే వాళ్ళతో మాట్లాడి సంబంధం ఖాయం చేశారు. అలా అనుకోకుండా లాస్ట్‌మినిట్‌లో కుదిరిపోయి పెళ్ళయిపోయింది.

''ఈ పెళ్ళి సీతకి ఇష్టంలేదా..''

అలా అనుకోడానికీ కారణం లేదు. ఇష్టం లేకపోతే చెప్పి ఉండేదిగా. సీతవంక చూశాడు శ్రీధర్. కళ్ళు మూసుకుని ఏదో దీర్ఘాలోచనలో ఉన్నట్టుంది. కనురెప్పల కింద తడి మెరుస్తోంది.

''ఆర్ యూ ఆల్‌రైట్.''

ఉలిక్కిపడింది సీత. ''ఫైన్ ఐయాం ఫైన్'' గొణిగింది మెల్లిగా.

శ్రీధర్ మనస్సునొక్కసారి ఏదో తెలియని నీరసం ఆవహించింది.

• • •

సీత మనస్సు మనస్సులో లేదు. తనేం చేస్తోంది... ఇంతవరకూ ఏ ఆడపిల్లా ఇలా చేసి ఉండదేమో.. వేరేదారి ఏం కన్పించలేదు. తను మాత్రం ఏం చేస్తుంది... ఇలా హఠాత్తుగా పెళ్ళవుతుందని కలలో కూడా అనుకోలేదు. ఉద్యోగం చేస్తాను కొన్నాళ్ళు అంటూ దాటవేస్తోంది. తండ్రిది మరీ పెద్ద ఉద్యోగమేం కాదు.. ఇంకా వెనకో చెల్లెలు. కొంత సంపాదిస్తే కట్నం ఎక్కువిచ్చి మంచి సంబంధం తేవాలని వాళ్ళూ ఊర్కున్నారు. హఠాత్తుగా శ్రీధర్ కట్నం కూడా వద్దని చేసుకుంటానంటే ఇంట్లో అందరికీ ఆనందంతో మతిపోయింది. తనకి మాట్లాడే అవకాశమే రాలేదు. ఏం చెప్పినా వింటారన్న నమ్మకమూ లేదు. న్యూయార్క్‌లో ఎర్‌పోర్ట్‌కి అన్నట్టుగా రమేష్ రాకపోతే.. సీతకి ఒక్కసారి ఒళ్ళంతా చల్లబడ్డట్టు అయింది.

''వస్తానన్నాడుగా.. తప్పక వస్తాడు.''

సీత వైజాగ్‌లో చదువుతున్నప్పుడు ఫ్రెండ్ వనజ



ఇంటికి తరచూ వెళ్తూండేది. వాళ్ళింటిపైన గదిలో వనజ కజిన్‌తోపాటు రమేష్‌చంద్ర కూడా ఉండేవాడు. నల్గురూ కబుర్లాడేవారు కల్సినప్పుడల్లా. మెల్లి మెల్లిగా రమేష్, సీతల మధ్య ప్రేమ అంకురించింది. రమేష్ బెంగాలీ.. తను ఆంధ్రా. వాళ్ళింట్లో ఒప్పుకున్నా తనింట్లో మాత్రం చచ్చినా ఒప్పుకోరు. రమేష్ తండ్రి చాలాఏళ్ళుగా వైజాగ్ చుట్టుపక్కల ఊళ్ళల్లోనే ఉద్యోగాలు చేయడంవల్ల రమేష్‌కి తెలుగు రాయడం చదవడం క్షుణ్ణంగా వచ్చు. చెప్తే తప్ప అతను తెలుగువాడు కాదని తెలియదు. రమేష్ ఇంజనీరింగ్ అవుతూనే అమెరికా వెళ్ళిపోయాడు. రెండేళ్ళు ఆగితే వచ్చి పెళ్ళి చేసుకుంటానన్నాడు. అక్కడ రమేష్ చదువు అవ్వాలి... రావాలి..

తను వైజాగ్‌లోనే ఉద్యోగం చేస్తూండటంవల్ల రమేష్‌తో మాట్లాడుతూనే ఉంది. అతని చదువు పూర్తయింది. ఉద్యోగం చూసుకుంటున్నాను త్వరలో వస్తాను అని అన్నాడు. ఇంతలో ఇలా.. పెళ్ళి...

ప్లేన్ న్యూయార్క్‌లో లాండయ్యింది.

''సీతా ఉయ్ ఆర్ హోమ్... ఇక్కడ నుంచి ఇంకో ప్లేనులో ఇంకొన్నిగంటలు.. మన ఇంట్లో ఉంటాం'' శ్రీధర్ ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లోకి నడుస్తూ అన్నాడు.

సీత అతని వెనకే నడుస్తూ నాలుగువైపులా చూస్తోంది.

''రమేష్'' సీత పరిగెత్తినట్టు వెళ్ళి రమేష్‌ని అల్లుకుపోయింది. హఠాత్తుగా సీత ఎవరిదగ్గరికో పరిగెత్తడం చూసి శ్రీధర్ దిమ్మెరపోయాడు. న్యూయార్క్‌లో ఎవరైనా వస్తారని కానీ, తెల్సినవాళ్ళు ఉన్నారని కానీ తనకి తెలియదే.

''సీతా...''

సీత వెనక్కి తిరిగి చూసింది. ఆ కళ్ళల్లో అంతులేని ఆనందం. కళ్ళల్లో కొత్త మెరుపు చూసి అయోమయంలో పడ్డాడు శ్రీధర్. కొంగు భుజాల చుట్టూ లాక్కుని అతని చేయిపట్టుకుని శ్రీధర్ దగ్గరికి వచ్చింది.

ఇతను రమేష్.. నా జీవితం.. నా గమ్యం అన్నీ ఇతనే. మిమ్మల్ని మోసం చెయ్యాలని నా ఉద్దేశ్యం కాదు. అర్థం చేసుకోండి. ప్లీజ్ నాకు వేరే దారిలేకపోయింది. నన్ను క్షమించండి.. క్షమకి అర్హురాలిని కానేమో కానీ.. ప్లీజ్ అర్థం చేసుకోండి. సారీ.. ఐయాం ఎక్స్‌ట్రీమ్‌లీ సారి'' సీత గబగబా అన్ని మాట్లాడటం ఈ కొన్నిరోజుల పరిచయంలో అదే మొదటిసారి. రమేష్ అతని చేతులు పట్టుకున్నాడు.

''శ్రీధర్‌గారూ.. మమ్మల్ని క్షమించండి.. మేమిద్దరం నాలుగేళ్ళుగా ఒకరికొకరం అని ఆశలు పెంచుకున్నాం.. హఠాత్తుగా ఈ పెళ్ళి.. ప్లీజ్.. ఇంత తొందరలో ఇలా సీతకి సంబంధం కుదరడం.. ఆలోచించే వ్యవధి కూడా లేకపోవటంతో. నేను మిమ్మల్ని మళ్ళీ వచ్చి కలుస్తాను. మమ్మల్ని అర్థం చేసుకుని క్షమిస్తారు కదూ.''

సీత బాగ్‌లోంచి ఓ కవర్ తీసి శ్రీధర్ చేతిలో పెట్టింది. వాళ్ళిద్దరూ బయటికి వెళ్తూంటే శ్రీధర్ షాక్ కొట్టినట్టు చూస్తూండిపోయాడు.

కవరు వంక చూశాడు. బరువుగా ఉంది. తెరిచి లోపల ఉన్న కాయితం బయటకి తీశాడు.

శ్రీధర్‌గారికి,

నేను రమేష్‌చంద్ర నాలుగేళ్ళుగా ప్రేమికులం. అతను ఇండియాకి వచ్చాక ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా పెళ్ళి చేసుకోవాలనుకున్నాం.. కానీ ఇంతలో మీరు రావడం.. మన పెళ్ళి.. అతన్ని ప్రేమించి జీవితం మీతో పంచుకోలేను. మా ప్రేమకథ చెప్పినా మన పెళ్ళి జరిగే ఉండేది.. ఆత్మహత్య చేసుకోలేకపోయాను. అందుకే మిమ్మల్ని అనకాపల్లి నుంచి అమెరికా రావడానికి వంతెనలా వాడుకున్నాను.. నన్ను క్షమించండి.

సీత

శ్రీధర్ అయోమయంగా కవర్‌లో ఉన్న ఇంకో వస్తువుని బయటకి తీసాడు. అవి మంగళసూత్రాలు.

★